క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రావు తెలిపారు. ఆనంద్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, జడ్జెస్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు డీఈ వివరించారు.

నేడు ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభ

దిల్‌సుఖ్‌నగర్: ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభ మంగళవారం సాయంత్రం కొత్తపేట బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహించనున్నట్లు డీఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కార్తీక్ మాహరాజ్ తెలిపారు. ఉదయం లోయర్ ట్యాంక్ బాండ్‌లోని అంబేడ్కర్ భవన్ నంచి ఎల్‌బీనగర్ మీదుగా కొత్తపేట జగ్జీవన్‌రామ్ భవన్ వరకు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సభకు జిల్లాల్లోకి బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలతో పాటుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజు హాజరు కానున్నారని తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 63, వంకాయ 45, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 52, బీర 50, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 35, ఆలు 23, ఉల్లి 19, గోకర 35, దోస 26, సొర 15, పొట్ల 28, అరటి 12, చిక్కుడు 75, అర్వి 40, మునగ 28, చిలగడదుంప 45, బీట్‌రూట్ 26, కీర 20, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యాప్సికమ్ రూ. 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా ప్రసిద్ధ్ హాస్పిటల్ వార్షికోత్సవం



మన్సూరాబాద్: గణేష్‌నగర్‌కాలనీలోని ప్రసిద్ధ్ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్‌లో కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకొన్నారు. హాస్పిటల్ డైరెక్టర్లు చైతన్యరాజు, ప్రదీప్, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ పల్లవి, నరేష్, విష్ణు, భార్గవ్, త్రివిక్రమ్, హరిణి, సుధీర్‌కుమార్‌రెడ్డి, విశ్వక్‌సేనా రెడ్డి, సురేష్‌కుమార్, అర్చనరెడ్డి పాల్గొన్నారు.

అఖిలకు స్వర్ణం



సాక్షి, హైదరాబాద్: భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జాతీయ జావెలిన్ డేను పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన జావెలిన్ త్రో పోటీల్లో రంగారెడ్డి జిల్లాకు చెంది న కుర్రా అఖిల స్వర్ణ పతకం సాధించింది. కొత్తపేటలోని శివాని డిగ్రీ కాలేజీలో బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి అయిన అఖిల జావెలిన్‌ను 30.08 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచింది.

సందడి చేసిన నిరుపేద చిన్నారులు

లక్డీకాపూల్: కిడ్స్ క్యాంపులో నిరుపేద చిన్నారులు మైమరిచి ఆడిపాడారు. సోమవారం తూంకుంటలోని విశ్వ విశ్వాని సంస్థలు నిరుపేద పిల్లల కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసింది. సుధీర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కళాశాల క్యాంపస్‌ను సందర్శించిన పిల్లలు ఇంటరాక్టివ్ సెషన్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేరణాత్మక కథనాలను పంచుకున్నారు, విశ్వ విశ్వాని విద్యార్థులతో ఆడారు.. విందును ఆస్వాదించారు. నిర్వాహకులు వారికి పుస్తకాలు, స్టేషనరీ కిట్‌లు అందించారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



మన్సూరాబాద్: సహారాస్టేట్స్‌కాలనీ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని కాలనీలోని ప్రధాన గేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు పెంటయ్య, వెంకటేశ్వర్లు, శేఖర్, గజం శ్రీశైలం, గురునాథం, కాలనీ మాజీ అధ్యక్షుడు సయ్యద్‌జానీ, బీజేపీ ఎల్‌బీనగర్ స్వచ్ఛభారత్ కన్వీనర్ గంగదాసు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నాగోలు: మమతానగర్‌లోని రోడ్ నెంబర్ 4లో నివాసం ఉండే శరణప్ప ఆదివారం డ్రైనేజీ నిర్మాణం కోసం అంటూ తవ్విన గోతిలో ప్రమాదవశాత్తు పడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి సోమవారం శరణప్ప ఇంటికెళ్లి అతని పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారి సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

చెత్త గోదాములతో పరేషాన్!



- శ్రీరమణకాలనీలో ఎక్కడిపడితే చెత్త గోదాములు
- పలు ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్గంధం వెజల్లుతున్నా పట్టించుకోని అధికారులు
- ప్రజలు మొరపెట్టుకుంటున్నా కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు

ఎక్కడైనా చెత్త పేరుకుపోతే దాని నుంచి వెలువడే దుర్గంధం పరిసర ప్రాంతాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. అయితే ఆ ప్రాంతంలో మాత్రం ఏకంగా చెత్తను నిల్వచేసే గోదాములు ఉన్నాయి. వాటి కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ శ్రీరమణ కాలనీలో చెత్త గోదాములు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్త ఇతర వ్యర్థాలను వాటిలో ప్రైవేటు వ్యక్తులు నిల్వ ఉంచుతారు. వారాల తరబడి ఒక్కోసారి నెలల తరబడి ఆయా వ్యర్థాలను నిల్వ ఉంచుతుండటంతో పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారుతోంది.

- దీనికితోడు జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం, వనస్థలిపురం, వింగోజిగూడ, చంపాపేట తదితర ప్రాంతాలలోని పలు ప్రాంతాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నదంటూ పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పలు ప్రాంతాలలో ప్రధాన రహదారులు, కాలనీలోని బహిరంగ ప్రదేశాలలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే చాలు పేరుకుపోయిన చెత్త నుంచి దుర్వాసన వెదజల్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని శ్రీరమణ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- శ్రీరమణకాలనీ రోడ్డు నంబర్ 5లో చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు శ్రీరమణకాలనీలో పేరుకుపోయినా చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి తమను అంటువ్యాధుల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జీహెచ్‌ఎంసీ వారే చెత్త వేస్తున్నారు..



రోడ్లపై కాలనీలలో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పలు ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను తీసుకువచ్చి రోడ్ల పక్కన వేస్తున్నారు. అందులో దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. శ్రీరమణకాలనీలో గోదాములలో పేరుకుపోయిన చెత్తకుప్పల కారణంగా పలు వ్యాధులు సోకి స్థానికులు ఆస్పత్రుల పాలవుతున్నారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారులపై చెత్తవేయకుండా చూడాలి. ప్రధాన, అంతర్గత రహదారులపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడాలి.

– మెరుగు వసంత, గృహిణి

చేనేతలకు ప్రభుత్వం చేయూత



జెండా అవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మాది చేతల ప్రభుత్వం చేనేతల ప్రభుత్వం, నేతన్నలకు అన్ని విధాలా సీఎం కేసీఆర్ అండగా ఉంటారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అనంతవేణి కాలనీలోని శ్రీ భావాన ఋషిదేవా చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత జెండా అవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులు ధరించి నేతన్నల జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. ఈ నెల 14 నుంచి రైతు బీమా మాదిరిగానే నేతన్న బీమా పథకాన్ని అమలు చేయనున్నారని తెలిపారు. నేతన్నలు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 5 లక్షలు అందజేస్తారన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింని తెలిపారు.బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు రాంబాబు, సతీష్, రాఘవేంద్రరావు, రాజు యాదవ్, తిరుమలేష్, కిరాండాస్, నర్సింహ, సత్యనారాయణ, విజయలక్ష్మీ, ప్రభాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కేసీఆర్ కుటుంబానికే పరిమితమా?

కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, శివసేనారెడ్డి

చైతన్యపురి: నీళ్లు, నిధులు నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కేవలం కేసీఆర్ కుటుంబానికే పరిమితమైందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి భారీ సంఖ్యలో యువకులు ఆదివారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి పీఅండ్‌టీ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌కుమార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గడిచిన 9 సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్‌కు ఎదురు చూసిన యువకులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్యాకేజీలు తీసుకుని లీకేజీలు చేసిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల బంగారు భవిష్యత్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే అయిన సుధీర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలోచేరి కాంగ్రెస్‌ను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఎల్‌బీనగర్‌లో తిరిగి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, గణేష్ రెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి, బద్దుల వెంకటేష్‌యాదవ్, వేణుగోపాల్, శశిధర్‌రెడ్డి, కార్తీక్, అవరింద్, పవన్, శ్రీనాథ్, చరణ్, ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

రెడ్డి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న సంఘం కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: 2018వ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెడ్డి కార్పొరేషన్‌ను సత్వరమే ఏర్పాటు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గడ్డిఅన్నారంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేద రెడ్డి పిల్లల భవిష్యత్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఆటలు ఆడుతుందని, మాట తప్పిన ప్రభుత్వంలో కొనసాగుతూ రాజకీయ పబ్బం గడుపుతున్న రెడ్డి రాజకీయ నాయకులు ఆలోచన చేయాలని కోరారు. పేద రెడ్డిలకు న్యాయం చేయలేని రెడ్డి ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెడ్డి ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రెడ్డి నేతల ఇళ్లను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, బెడ్‌షీట్స్, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, హైదరాబాద్ ముత్యాలు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

సైదాబాద్ అంతర్గత రహదారులను ఆధునికీకరిస్తాం

కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులు అన్నీ దశలవారీగా ఆధునికీకరిస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సైదాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని రహదారులు ఛిద్రమయ్యాయన్నారు. వాటిని పునర్నించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆమె సూచించారు. పలుచోట్ల డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అవి పూర్తయిన తరువాత ఆయా చోట్ల సైతం రహదారులు ఆధునీకరిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, చందు, స్వాతి, సుభాష్ పాల్గొన్నారు.

ఎంఎన్ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

- అందుబాటులోకి అన్ని రకాల వైద్య సేవలు
- మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల



వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ మినాజుద్దీన్

మలక్‌పేట: ఎంఎన్ ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. ఐదు సంవత్సరాలలోపు వయసు కలిగి పిల్లల కోసం స్థానిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ సెంటర్, 102 అంబులెన్స్ అండ్ ఐఎంఐ (ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్)ను జెండా ఊపి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆస్పత్రిలో ఇంకా మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ప్రజావైద్యానికి సర్కార్ పెద్ద పీట వేసిందన్నారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యామ్, మలక్‌పేట క్లస్టర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజున్నీసా, డాక్టర్ తరుణ్, ఇన్‌చార్జి కరుణాకర్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

జల్సాల కోసం సెల్‌ఫోన్ల స్నాచింగ్

- ఇద్దరి అరెస్టు.. 4 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం
- వనస్థలిపురం ఏసీపీ ఎస్.భీంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి

హస్తినాపురం: జల్సాలకు అలవాటు పడి సెల్‌ఫోన్‌ల స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం వనస్థలిపురం ఏసీపీ ఎస్.భీంరెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన జోగు గణేస్(20) వనస్థలిపురంలోని ఎస్‌కేడీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సాగర్ కాంప్లెక్స్ సిరిపురం కాలనీలో నివాసం ఉండే అతని దగ్గర బంధువైన దొరపల్లి శివ(19)లు ముఠాగా ఏర్పడి తక్కువ సమయంలోఎక్కువ డబ్బులు సంపాదించాలనే అత్యాశతో దొంగతనాలు దోపిడీలకు పాల్పడేందుకు పథకం రచించారు. అందులో భాగంగానే వీరు కలిసి బైక్‌పై వెళ్తూనే సెల్‌పోన్‌లను దొంగిలించేందుకు పథకం వేసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎన్ రెడ్డినగర్‌లోని సాగర్‌రహదారిపై బైకుపై వెళ్తున్న ఒక వ్యక్తి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిని చేదించి పట్టుకుని వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒకబైకును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు, ఒక మైనర్ బాలుడిని జువైనల్ హోంకు పంపినట్లు ఏసీపీ భీంరెడ్డి వెల్లడించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేంధర్‌రెడ్డి, డీఐ వెంకట్, ఎస్ఐ నర్సింగ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని, సుందరంగా తీర్చిదిద్ది సందర్శకులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–3 కాలనీవాసులు కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీలో పార్కు అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సాయినికేతన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భరత్‌లాల్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులు సంజీవరెడ్డి, బి.ఎం.రావు, ఆర్.కె.రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయండి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సోమవారం భీమానగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ... భీమానగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరగా పూర్తికావడమే కాకుండా ఆ పనులలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కోటి 9 లక్షల రూపాయలతో కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను పూర్తిచేస్తే కాలనీలో సమస్యలన్నీ తొలగిపోతాయని, కాలనీలో పార్కు ప్రహరీకి రూ. 14 లక్షలు మంజూరు చేయించామన్నారు. అతిత్వరలోనే పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, భీమానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేశ్, కోశాధికారి వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరనిలోటు



గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



గద్దర్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: విద్యార్థి దశ నుంచి తుదిశ్వాస వరకు ప్రజా పోరాటాలతో ప్రజా యుద్ధ నౌక గద్దర్ జీవితం మమేకమైందని సీపీఎం నాయకులు అన్నారు. వనస్థలిపుం ఎన్‌జీవోస్ కాలనీ లేబర్ అడ్డా వద్ద గద్దర్‌కు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గద్దర్ మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, నాయకులు ఎల్లయ్య, గణేష్‌గౌడ్, ఆంజనేయులు, అంజయ్య, సృజన, రాధమ్మ, నరసమ్మ, వెంకటయ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఎందరికో గద్దర్ స్ఫూర్తి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమ నేత గద్దర్ మరణించడం ఎంతో కలచివేసిందని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్‌బీ స్టేడియంలో గద్దర్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాకళలు, జానపదం ఉన్నంతకాలం, ప్రజా కవి గద్దర్ పేరు నిలిచి ఉంటుందని ప్రజల హృదయాల్లో తన ఆటపాటలతో చైతన్య రగిలించాలని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లేంకి ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి

గానంతో సామాన్యులను ఉత్తేజపరచిన గద్దర్

చాదర్‌ఘాట్: గద్దర్ తన గానంతో సామాన్యులను సైతం ఉత్తేజపరచారని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓల్డ్‌మలక్ పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన తన పాటలతో జనాలను చైతన్యపరిచారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు శ్రీనివాస్, విష్ణుదేవ్, గడ్డం నరేందర్, మహేష్, రాజేందర్ పాల్గొన్నారు.

వేడుకగా అమ్మవారి ఘటం ఊరేగింపు



ఘటం ఊరేగింపులో పాల్గొన్న బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు తదితరులు

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఘటం ఊరేగింపు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మోహన్ నగర్ బీజేపీ కార్యాలయం నుంచి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్‌రావు పాల్గొని అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం ప్రారంభించారు. మురళీధర్ రావు మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఉండాలని... అంటువ్యాధులు ప్రబలకుండా కాపాడాలని అమ్మవారిని ప్రార్థించామనారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు పవన్ కుమార్, రంగా నరసింహ గుప్తా, ప్రేమ్ కుమార్, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఘటం ఊరేగింపు బీజేపీ కార్యాలయం మోహన్ నగర్ నుంచి ప్రారంభమై బాలాజీ నగర్ కాలనీ బంగారు మైసమ్మ, శ్రీ పోచమ్మ, మోహన్ నగర్ విలేజ్ చిత్తారమ్మ, కమర్షియల్ టాక్స్ కాలనీ శీతల మాత ఆలయాల మీదుగా ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ పోచమ్మ ఆలయం కొత్తపేట విలేజ్ మహంకాళి అమ్మవారు, సత్య నగర్ శ్రీ మైసమ్మ, వినాయక్ నగర్ కాలనీ శ్రీ బంగారు గవ్వల రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రవీణ్ కుమార, పవన్ కుమార్, శ్రీధర్‌గౌడ్, అంబాల మల్లేష్ గౌడ్, కొర్లపల్లి స్వామి, రాజేందర్, కిరణ్, వినోద్, తరుణ్ సింగ్ ఠాగూర్, గౌరవ షా, సంప్రీతి, అవినాష్, భావన, మల్లికార్జున్, యశ్వంత్, విష్ణు పాల్గొన్నారు.